క్లుప్తంగా

ఆదోని మార్కెట్‌యార్డు సెక్రటరీగా గోవిందు


బాధ్యతలు చేపట్టిన గోవిందు

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డు సెక్రటరీగా గోవిందు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కొంతకాలగా నంద్యాల మార్కెట్‌యార్డు సెక్రటరీ కల్పన ఆదోని మార్కెట్‌యార్డు ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తోంది. ఈక్రమంలో అనంతపురం మార్కెట్‌యార్డు సెక్రటరీ గోవిందును ఆదోని మార్కెట్‌ఖ సెక్రటరీగా నియమిస్తూ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

నందవరం : ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పని చేసే కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాదాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష యూనియన్ నాయకులు ఉరుకుంద ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, కార్మికులు, కర్షకుల లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం నియోజకవర్గ బాధ్యుడు రాముడు ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ఉరుకుంద, కమిటీ మెంబర్లు పద్మ, పుణ్యవతి, భాగమ్మ, మంజుల, ఆనంద్, కోదండ, శారద, తులసమ్మ, హేమలత, లక్ష్మీదేవిలను ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

ఆదోని టౌన్: పట్టణంలోని కార్వన్‌పేట–కొడల్‌పేట సెంటర్‌లోని దుల్హా పైల్వాన్ మసీదు దర్గా వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని కాలనీవాసులు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ వెంటనే అక్కడ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక

కోసిగి:మండల సీఐటీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం కోసిగిలో కార్మికులతో సమావేశం నిర్వహించగా, జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు సమక్షంలో ఎన్నికలు పూర్తయ్యాయి. మండల కమిటీ అధ్యక్షుడిగా రాముడు, కో కన్వీనర్లుగా హెప్సిభా రాణి, వెంకటమ్మ, సభ్యులుగా లూసమ్మ, వరలక్ష్మీ, సుజాత, వెంకటేష్, గుర్రం వీరేష్, ఈరన్న, మదుసూదన్, రామలింగను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ.. కార్మికులు ఐక్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు.

నకిలీ డీఏపీ విక్రయదారుడిపై కేసు నమోదు

ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబలం గ్రామంలోని నబీ ట్రేడర్స్ వద్ద ఈనెల 3న 76 బస్తాల డీఏపీ ఎరువులు అనుమానాస్పదంగా ఉండడంతో ఏఓ సుధాకర్ పరిశీలించి, కర్నూలు ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్ ఫలితాల ప్రకారం నాణ్యతా ప్రమాణాలకు అనుగుణం లేవని, నకిలీవని తేలడంతో జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఏఓ సుధాకర్ పెద్దతుంబళం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నబీ ట్రేడర్స్ దుకాణం యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు.

గుప్త నిధుల తవ్వకాలకు యత్నించిన వారిపై కేసు నమోదు

ఆదోని రూరల్: మండలంలోని ఢణాపురం గ్రామంలో గుప్తనిధుల తవ్వకాలకు ప్రయత్నించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ నల్లప్ప తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గుప్త నిధుల తవ్వకాల్లో 20 మందికి పైగా ఉన్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రస్తుతం 12 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గ్రామంలో ఉన్న ఊరుబావిలో గురువారం అర్ధరాత్రి గుప్త నిధుల తవ్వకాలు జరిపినట్లు సమాచారం అందిందన్నారు. కేసు దర్యాప్తులో ఉందని, త్వరలోనే అన్ని వివరాలు తెలియజేస్తామని సీఐ వివరించారు.

పోలీసుల అదుపులో పందుల దొంగలు

ఆదోని అర్బన్: పట్టణంలో ముగ్గురు పందుల దొంగలను వన్‌టౌన్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. తెల్లవారుజామున పందుల పెంపకందారులు దొంగలను అడ్డుకుని వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై వన్ టౌన్ సీఐ శ్రీరామ్ మాట్లాడుతూ ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు.

థెరిసా సేవలు చిరస్మరణీయం

ఎమ్మిగనూరుటౌన్: మదర్ థెరిసా సేవలు చిరస్మరణీయమని స్థానిక వేదాస్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు సునీల్‌కుమార్ పేర్కొన్నారు. థెరిసా వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఎంపీ చర్చి వద్దనున్న అమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వి.నాగరాజరావు,సప్పోగు ప్రభాకర్, తిమ్మరాజు పాల్గొన్నారు.

- వరుస వర్షాలతో రైతన్న కుదేలు
- పంటపొలాలను వదలని వర్షపు నీరు
- తేమశాతం ఎక్కువై కుళ్లుతున్న పైర్లు
- బురదమయంగా మారిన పొలాలతో రైతన్న అవస్థలు
- ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్న అన్నదాతలు


నీళ్లు నిలబడడంతో పూర్తిగా దెబ్బతిన్న పత్తి పంట


కుళ్లిపోయిన మిరప పంట

కుళ్లుతున్న ఆశలు!

కౌతాళం: వ్యవసాయం ఆశల జూదం అయ్యింది. గత నెల రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతన్నలు అల్లాడుతున్నారు. ఈ ఏడాది మే నుంచే వర్షాలు కురవడంతో అన్నదాతలు ఎంతో సంతోషంగా పంటలు సాగు చేసుకున్నారు. కాగా జూలై చివరి వారం నుంచి ఇప్పటి వరకు రెండు రోజులకోసారి వర్షం కురుస్తుండటంతో పాటు వరుస తుపాన్ల కారణంగా పొలాల్లో నీళ్లు నిలిచి పైర్లు కుళ్లిపోతుండటంతో రైతన్నల ఆశలు ఆవిరి అవుతున్నాయి.

పంటలపై తేమ ప్రభావం

మండలంలో పత్తి పంట 54వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. అందులో మిరప 2,375 ఎకరాల్లో, వరి 5,100ఎకరాల్లో వేశారు. ప్రధానంగా సాగైన పత్తి పంటలో వరుస వర్షాల వల్ల తేమ శాతం పెరిగిపోవడంతో కొన్ని చోట్ల పైరు పెరగక, కాపు రావడం లేదు. మరికొన్ని చోట్ల కాయలు కాసినా తేమశాతం అధికంగా ఉండటంతో రాలిపోవడంతో పాటు కుళ్లిపోతున్నాయి. మిరప పంట పరిస్థితి మరీ దారుణంగా ఉంది. మండలంలో 90శాతం భూమి నల్లరేగడి కావడంతో మిరప పంట చాల వరకు కుళ్లి పోయింది. గతేడాది నష్టాల్ని పూడ్చుకుందామనుకుంటే ఈ ఏడాది అదనంగా నష్టపోవాల్సి వచ్చిందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు రైతులు యూరియా లేక అల్లడిపోతున్నారు. అధిక ధర అయిన కాంప్లెక్స్ ఎరువుల్ని వేసుకుంటున్నారు.

పొలాలను వదలని వర్షపు నీరు

కౌతాళంతో పాటు బదినేహాల్, ఉప్పరహాల్, నదిచాగి, కుంటనహాల్ గ్రామాల్లో వంకలు, వాగుల పక్కన సాగుచేసిన మిరప, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని పొలాల్లో వరద నీరు ఇంకా నిలబడి ఉండగా.. కొన్ని పొలాల్లో ఇసుక మెట వేసింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పంటలు ఇలా కళ్లముందే పూర్తిగా దెబ్బతినడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

480 ఎకరాల్లో పంట నష్టం : మండలంలో నిత్యం కురుస్తున్న వర్షాల వల్ల వంకలు, వాగుల పక్కన ఉన్న పంట పొలాల్లో సాగు చేసిన పంటలు 480ఎకరాల్లో దెబ్బతిన్నాయని ప్రాథమిక అంచన వేసినట్లు వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. అధికంగా మిరప, పత్తి పంట దెబ్బతిన్నట్లు వెల్లడించారు.

ఇంకా నీటిలోనే పంట



నిత్యం వర్షం వస్తుండడంతో పంట అంత నీటిలోనే ఉంది. పొలంలో ఇంకా అడుగు నుంచి రెండు అడుగుల వరకు నీరు ఉంది. నీరు ఎప్పుడు తగ్గుతుందో.. పంట ఎప్పుడు కనబడుతుందో అని ఆందోళనగా ఉంది. నాకు ఉన్న ఎకరాన్న పంట అంతా ఇలా అయితే ఎలా బతకాలి. ప్రభుత్వం ఆదుకోక పోతే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం. –పింజారి మహమ్మద్, రైతు

ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి



రెండు ఎకరాల్లో సాగుచేసిన మిరప పంట పూర్తిగా దెబ్బతింది. పొలం అంత బురద మయంగా మారింది. వంక పక్కన ఉండటంతో బురద అంతా పొలంలో కొట్టుకుని రావడంతో ఒక ఎకరా వరకు పంటను తొలగించి వరి నారు వేసుకున్నాను. ఇప్పటికే 5నుంచి 6సార్లు మందులు పిచికారీ చేశా. ఎకరాకు ఇప్పటి వరకు రూ.20వేలు వరకు ఖర్చు చేసినా పంట ఎదుగుదల లేదు. పంట వస్తుంద లేదా అన్న ఆందోళన ఉంది. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలి. – రాజసాబ్, రైతు

పంటంతా కుళ్లి పోయింది



ఉన్నరెండు ఎకరాల పొలంలో సాగు చేసిన మిరప పంట అంతా కుళ్లి పోయింది. తేమశాతం అధికం కావడంతో పంట పూర్తిగా దెబ్బతింది. మా లాంటి పేద రైతులకు ఆదేవుడే కాపాడాలి. –వీరభద్ర ఆచారి, రైతు

విద్యార్థుల భవిష్యత్ మార్గదర్శకులు గురువులే


ఎస్టీయూ కార్యాలయంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


ఎస్ఎస్ఎస్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడు కరె కృష్ణను సత్కరిస్తున్న విద్యార్థులు


కోసిగి: సర్వేపల్లి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు


పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థుల భవిష్యత్‌కు మార్గదర్శకులు గురువులేనని ఎస్టీయూ రాష్ట ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో పలు పాఠశాలలు,జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్టీయూ, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్, యూటీఫ్ కార్యాలయాలు, కళాశాలల్లో ఆయా సంఘాల నాయకులు,అధ్యాపకులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగు,, స్థానిక ఎస్ఎస్ఎస్ హైస్కుల్, రావూస్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఉపాధ్యాయుడు కరెకృష్ణతో పాటు పలువురు ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. పీఆర్‌టీయూ కార్యాలయంలో హెచ్ఎం శ్రీనివాసులు,పీఎస్‌హెచ్ఎం రహిమాన్,ఉపాధ్యాయులు దాసరి కేశవయ్యను బారికి చంద్రశేఖర్, న్యాయవాది మారుతి ప్రసాద్, ప్రజాసంఘ నాయకుడు నరసన్న సత్కరించారు.

- **కోసిగి:** స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి టీచర్లు, విద్యార్థులు నివాళులర్పించారు. సెలవు రోజు కావడంతో అందుబాటులో ఉన్న పీడీ ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయుడు రమణకుమార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఆదోని సెంట్రల్: పట్టణంలో వెంకన్నబావి సమీపంలో ఉన్న పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఎస్టీయూ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆలూరు, ఆస్పరి మండలాల విద్యాధికారులు చిరంజీవి రెడ్డి, తిరుమలరావు.. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్టీయూ అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేంద్రప్ప, మాజీ రాష్ట్ర కౌన్సిలర్ నరసింహులు, సీనియర్ నాయకులు శివన్న, వెంకటస్వామి, ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఎస్ఎండీ గౌస్, సన్నప్ప, నాగప్రసాద్‌లను సన్మానించారు. పురపాలక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

- **ఆదోని రూరల్:** పట్టణంలోని ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇస్వీ గ్రామ జెడ్పీహెచ్ పాఠశాల హెచ్ఎం, ఏపీటీఎఫ్ సీనియర్ నాయకులు వెంకటేశులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.నాగరాజు, నాయకులు రాఘవేంద్ర, ముత్తన్న, లక్ష్మీనారాయణ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **ఆదోని అర్బన్:** స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్, అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఆదోని రూరల్: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు తిప్పన్న, పి.ఎస్.గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన ఆటో డ్రైవర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సంక్షేమ బోర్డు ఏర్పాటు హామీని కూటమి ప్రభుత్వం అమలు చేసి ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు. అనంతరం ఆటో యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

గుమ్మనూరు జయరాంను బర్తరఫ్ చేయాలి



మాట్లాడుతున్న రాధాకృష్ణ

ఎమ్మిగనూరుటౌన్: అనంతపురం జిల్లాలోని గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో సోలార్ పరిశ్రమ కోసం సేకరించిన భూములను కోల్పోతూ నష్టపోయే రైతులకు అండగా నిలిచిన రైతు సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ చేసి దూషించిన గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు న్యాయం చేయాలని పోరాడుతున్న సీపీఎం నాయకుడిని ఎమ్మెల్యే బెదిరించడం దుర్మార్గమన్నారు. నాయకులు గోవిందు,అబ్దుల్లా,సురేష్, రమేష్ పాల్గొన్నారు.

13 నుంచి ఎద్దుల బలప్రదర్శన పోటీలు


కరపత్రాలను విడుదల చేస్తున్న ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు

గోనెగండ్ల: స్థానికంగా వెలసిన చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారి దశమి ఉత్సవాల సందర్భంగా గోనెగండ్ల ట్రాక్టర్స్ యూనియన్ సహకారంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రాక్టర్స్ యూనియన్ నాయకులు ఉసేన్, శివన్న, నూర తెలిపారు. శుక్రవారం స్థానిక హైస్కూల్ ఆవరణలో పోటీల కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ దశమి సందర్భంగా ఈనెల 13 నుంచి 15 తేదీ వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 13న నాలుగు పళ్ల విభాగం పోటీల్లో గెలుపొందిన యజమానులకు వరుసగా.. రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు నగదు బహుమతి అందజేస్తామన్నారు. అలాగే 14న ఆరు పళ్ల సైజు ఎద్దుల పోటీల్లో విజేతలకు వరుసగా.. రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు, రూ.3వేలు ఇస్తామన్నారు. 15న న్యూ కేటగిరి ఎద్దుల పోటీల విజేతలకు వరుసగా.. రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేస్తామని వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు నాలుగు పళ్ల సైజుకు రూ.500, ఆరుపళ్ల సైజు రూ.600, న్యూ కేటగిరికీ రూ.700 ప్రవేశ రుసుము చెల్లించాలని సూచించారు. వివరాలకు సెల్ 9949151807, 8522014358, 9394959515 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రహంతుల్లా, గోపాల్, వెంకటేష్, మాబు, భాస్కర్ పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్-నబీ వేడుకలు



ఎమ్మిగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు, ర్యాలీలో ఆకట్టుకున్న మక్కా,మదీన నమూనాలు

- **ఎమ్మిగనూరు టౌన్:** మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా మిలాద్ ఉన్-నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక జామీయా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు, ముస్లింలు మసీదు నుంచి బయలుదేరి శాంతి ర్యాలీని సోమప్ప సర్కిల్ మీదుగా నిర్వహించారు. అనంతరం మసీదు సమీపంలో వేడుకలు నిర్వహించారు. మత పెద్దలు మౌలానా మహబుబ్ జిలానీ, అబ్దుల్ హమీద్, మౌలానా ఖైరుల్లా, హనీఫ్,రోషన్‌షరీ ఫ్,రోషన్ జమీర్, జామియామసీదు కమిటీ పెద్దలు ఖాశింబేగ్,అల్లావుద్దీన్,సాబిర్,సయ్యద్‌చాంద్,సాబిర్, నూర్‌అహమ్మద్,బందెనవాజ్,దాదాసాహెబ్,ఇబ్రహీం ,గట్టు అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.
- **నందవరం :** మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరణీయమని ముస్లిం మత గురువులు తెలిపారు. మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో మీలాద్-ఉన్- నబీ వేడుకలు నిర్వహించారు. నాగలదిన్నె గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మత పెద్దలు ప్రవక్త మార్గం గురించి వివరించారు.
- **గోనెగండ్ల:** మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలను మండలంలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఉదయం ఆయా దర్గాలు, మసీదుల్లో ప్రత్యేక ఫాలహాలు చేశారు. మహమ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, నీతి, సహృద్భావం, దానగుణాన్ని ముస్లిం మత గురువులు తెలియజేశారు. స్థానిక సంతమార్కెట్ సమీపంలో మౌలాలి కట్ట దగ్గర నుంచి జెండాను వైఎస్సార్ సర్కిల్ వరకు ఊరేగించారు.
- **కోసిగి:** మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కటికె వీధి, నూరాణి సున్నీ మజీద్, మదినా,ఏ ఆక్సా, ఏ అన్వరుల్లా ఫా రు ఖీ మసీద్‌లలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ము స్లింలు మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవా లని సూచించారు. మసీద్‌లను విద్యుత్ దీపాలు,జెండాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం కటికె వీధి నుంచి ర్యాలీ నిర్వహించారు. అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్-నబీ

మంత్రాలయం రూరల్: మండల కేంద్రం మంత్రాలయంతో పాటు వగరూరు, మాధవరం, తుంగభద్ర, రాంపురం, మాలపల్లి, సుగూరు, సుంకేశ్వరి తదితర గ్రామాల్లో మిలాద్- ఉన్-నబీ వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రాలయంలో ముస్లిం మత పెద్దలు, జామీయ మసీదు నుంచి ఆయా వీధుల మీదుగా రాఘవేంద్ర స్వామి సర్కిల్ నుంచి ఈద్గ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే వగరూరు, మాధవరం తదితర గ్రామాల్లో జెండాలు పట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. మత పెద్దలు ఇమాం ఖాజా బందేనవాజ్, సయ్యద్ లతీఫ్ పీరా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శాంతి, సహనంతో మెలగాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ రామాంజులు ఆధ్వర్యంలో ఎస్ఐ శివాంజల్, మాధవరం ఎస్ఐ విజయ్‌కుమార్ పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. మత పెద్దలు సాబువలి, అండేబాషా, అక్బర్‌వలి, చాంద్‌బాషా, రఫిక్, ఖాజా, గని పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలు

కౌతాళం: మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గం సమాజానికి శ్రేయస్కరమని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు తెలిపారు. శుక్రవారం కౌతాళంతో పాటు చిరుతాపల్లి, చూడి, హల్వీ, నదిచాగి, ఉప్పరహాల్, కుంటనహాల్, బదినేహాల్, గుడికంబాలి గ్రామాల్లో మిలాద్-ఉన్-నబీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. సాయంత్రం గ్రామాల్లో ముస్లింలు ప్రధాన వీధుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. కౌతాళంలో ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ప్రవక్త పవిత్ర కేశాలను భక్తుల దర్శనార్థం ఉంచారు. జెండా ఊరేగింపుతో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజాము వరకు కొనసాగింది. తక్బీర్లు చదువుకుంటూ ఊరేగింపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్త మున్నపాషా చిష్తీ మాట్లాడుతూ.. పరస్పర సంబంధాలు, సామరస్య పూర్వక వాతావరణం ఉంటే మానవ సమాజంలో శాంతి నెలకొంటుందని అన్నారు. ప్రవక్త బోధించిన మార్గంలో నడిస్తే అసత్యం, చెడుతనం లాంటివి దూరమవుతాయని చెప్పారు. రోజుకు ఐదు పూటల నమాజు ఆచరించడం, హజ్ యాత్ర చేయడం, జకాత్ ఇవ్వడం, దానధర్మాలు చేయడం ప్రతి ముస్లిం బాధ్యత అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కురుగోడు దర్గా ధర్మకర్త ఖాజాపీర్ మున్నపాషా తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో..


ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


మహమ్మద్ ప్రవక్త వస్తువులను తిలకిస్తున్న ముస్లింలు


మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ హఫీజ్‌ఖాన్

ఆదోని సెంట్రల్/రూరల్: మిలాద్ ఉన్ నబీ వేడుకలను శుక్రవారం ఆదోనిలో ముస్లింలోఉ ఘనంగా నిర్వహించుకున్నారు. తిక్కస్వామి దర్గా నుంచి ప్రధాన రహదారుల మీదుగా షాహి జామియా మసీదు వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ప్రార్థనలు నిర్వహించారు. కొడల్ పేట, నిర్మల్ టాకీస్ సమీపంలో ముక్తర్ అహ్మద్ సాహెబ్ ఇంటి వద్ద మహమ్మద్ ప్రవక్త వాడిన వస్తువులు, తలనీలాలను సందర్శనార్థం ఉంచారు. మహమ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని మత గురువులు సూచించారు. నిజాముద్దీన్ కాలనీ యువకులు నిరుపేదలైన 15 కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. పెద్దతుంబళం గ్రామంలోనూ ముస్లింలు శాంతియుత ర్యాలీ చేపట్టారు. ఆదోనిలో నిర్వహించిన మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ హఫీజ్‌ఖాన్ పాల్గొన్నారు.


నాగలదిన్నెలో ర్యాలీ చేపట్టిన ముస్లింలు


మంత్రాలయంలో ముస్లిం ర్యాలీ


వగరూరులో ఊరేగింపు చేపట్టిన ముస్లింలు


కౌతాళంలో జెండాలతో ముస్లింల ర్యాలీ


ఊరేగింపులో దర్గా ధర్మకర్త, గ్రామ పెద్దలు


గోనెగండ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు


కోసిగిలో గోఖర్ జెండాను ఊరేగిస్తున్న ముస్లింలు


కరేలాలతో విన్యాసాలు

కంప చెట్లలో పశువుల నీటి తొట్టి

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని కల్లుదేవకుంట గ్రామంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పశువుల నీటి తొట్టి కంప చెట్లతో నిండిపోయింది. ప్రభుత్వం రూ.32 వేలు ఖర్చు చేసి పశువుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన నీటి తోట్టి ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. నీటితొట్టి నిర్మించి 6 నెలలు గడిచినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. మండలంలో ఇలా నిర్మించిన వాటికి చాలా చోట్ల వాటర్ కనెక్షన్లు కూడా లేవు. ప్రతి నీటి తొట్టిని వాడుకలోకి తీసుకురావాలని పాడిరైతులు కోరుతున్నారు.


కల్లుదేవకుంటలో కంప చెట్ల మధ్య ఉన్న పశువుల నీటి తొట్టి